# కార్మికవర్గ పోరాటంలో ట్రేడ్ యూనియన్ల పాత్ర



*బోల్షివిక్ విప్లవకారుడు యస్.ఏ.లొజొవిస్కి(**1878-1952**) వ్రాసిన 'ట్రేడ్ యూనియన్ల గురించి మార్క్స్, ఎంగెల్సులు' అనే పుస్తకంలో, కార్మికవర్గంలో వర్గ స్పృహను పెంపొందించటం, పని ప్రదేశాలలో కార్మిక సంఘాలనేర్పరచి, కార్మికుల ఆందోళనలు, పోరాటాలు సాగించటం యొక్క అవసరాన్ని నొక్కిచెప్పారు.*

*సొలమన్ లొజొవిస్కి రాసిన ఈ పుస్తకాన్ని పడాల రామారావుగారు తెలుగులోకి అనువదించి మొదటిసారి **1980**లో ప్రచురించారు. దీనికి కొన్ని ఫుట్‌నోట్లు, అనువాదంలో చిన్నపాటి సవరణలు చేసి రంగనాయకమ్మగారు **2012** అక్టోబర్‌లో దీనిని, దీనితోపాటు 'ఏం చేయాలి' పుస్తకాన్ని కలిపి ప్రచురించారు. 'ట్రేడ్ యూనియన్ల గురించి మార్క్స్-ఎంగెల్స్‌లు' అన్న పుస్తకంలోని 'కార్మికవర్గ పోరాటంలో ట్రేడ్ యూనియన్ల పాత్ర' అన్న మొదటి ఛాప్టర్‌ను పునర్ముద్రిస్తున్నాం*

***- సంపాదకుడు.***

**ట్రేడు** యూనియన్లు యేర్పడుతున్నప్పటి దశలో మార్క్సు, రాజకీయంగా ఆలోచించడం మొదలు పెట్టాడు. ఫ్రాన్సులాంటి కొన్ని దేశాలలో, కార్మికుల మధ్య పలు పరస్పర సహాయక సొసైటీలు వుండేవి. 'పరస్పర సహాయక విధానం' అంటే, ఆ సహాయాలు కార్మికుల మధ్యనే కాదు; కార్మికులకూ, యజమానులకూ మధ్య కూడా సహాయాలు సాగాలి. యజమానులు, కార్మికులకు చేసే సహాయాలేవీ వుండవు. కార్మికులే యజమానులతో సహకారంగా వుండాలి. ఎలాగంటే, వాళ్ళను ఇబ్బంది పెట్టకుండా, వాళ్ళ ఆజ్ఞలకు అణిగి మణిగి పనిచేస్తూ వుండడం ద్వారా!

ఆ సహాయక సంఘాల్లో నించే క్రమంగా కార్మికుల ట్రేడు యూనియన్లు (వృత్తి సంఘాలు) రూపు దిద్దుకొనుట ప్రారంభమైంది. ఇంగ్లండు లాంటి ఇతర దేశాల్లో ట్రేడు యూనియన్లు, ఆర్థిక సమ్మెలనూ, ఓటు హక్కుకై పోరాటాలనూ ప్రారంభించాయి. ఆ పోరాటాలను మార్క్సు, కార్మికుల ఆశయాల్లో విభిన్న మైనవిగానూ, స్వరూపంలో పిండాకృతిగా నున్న అతి ప్రాథమిక రూపాలుగానూ గమనించాడు. ఆ పోరాటాలను, కార్మికవర్గ శైశవావస్థకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్టుగా భావించడంలోనే మార్క్సు గొప్పదనం ఉన్నది. కానీ ఆ ఉద్యమ ప్రాథమిక రూపాలనుబట్టి మాత్రమే, దాని చారిత్రక పాత్రనూ, అభివృద్ధిక్రమాన్నీ నిర్ధారణ చేయడం సాధ్యం కాదు.

మార్క్సు, మొట్టమొదట ఆ ట్రేడు యూనియన్లను- కార్మికశక్తులను సమీకరించి, వారికి ప్రాథమిక వర్గ శిక్షణను యిచ్చే కేంద్రాలుగా పరిగణించాడు. ఆ ట్రేడు యూనియన్ల పద్ధతిలో, మార్క్సుకు, అప్పటివరకూ ఒకరిపై ఒకరు పోటీపడుతూ, చెల్లాచెదురైవున్న కార్మికులు ఒక కేంద్రానికి చేరుకొని, ఐక్యకార్యాచరణకు పూనుకోవడం కనబడింది. ఆ ఐక్యకార్యాచరణలోనే, అందులోనే, కార్మికవర్గం ఒక స్వతంత్రశక్తిగా అభివృద్ధి కాగల పూచీ యేర్పడినట్టు ఆయన గ్రహించాడు. అందుకనే మార్క్సు-ఎంగెల్సులు, తమ రచనల్లో ఒక సంగతి మరీ మరీ పేర్కొన్నారు-ట్రేడు యూనియన్లు, కార్మికుల సంఘీభావానికీ, సామ్యవాదానికీ (సోషలిజానికి) దారితీసే పాఠశాలలు-అని. అలా అని ఊరుకోకుండా, ఆ భావాన్ని మార్క్సు మరింత అభివృద్ధి పరిచాడు. ట్రేడు యూనియన్ సమస్యలను అన్ని దృక్కోణాలనుంచీ పరిశీలించాడు.

1866లో, జెనీవాలో (స్విట్జర్లాండు దేశంలో) జరిగిన మొదటి ఇంటర్నేషనల్ మహాసభ, 'ట్రేడు యూనియన్ల భూత-భవిష్యత్-వర్తమానాలు' అనే తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మాన రచయిత కారల్ మార్క్స్.

ట్రేడు యూనియన్ల గతం ఏమిటి?

'పెట్టుబడి' అనేది, కేంద్రీకృత సాంఘిక శక్తికాగా, కార్మికులకు వున్నది-వ్యక్తిగత శ్రమశక్తి మాత్రమే. అంచేత పెట్టుబడికీ, శ్రమకూ మధ్య న్యాయ సమ్మతమైన ఒడంబడిక ఎన్నటికీ కుదరదు. ఒక ప్రక్క-ఉత్పత్తి సాధనాలూ, పోషణ సాధనాలూ, యజమానుల ఆధీనంలో వుండి, మరోప్రక్క-జీవన శ్రమశక్తులు మాత్రమే కార్మికుల ఆధీనంలో ఉన్నప్పుడు, న్యాయం రెండు ప్రక్కలా వుంటుందని భావించడం చాలా అజ్ఞానం. కార్మికులకు వుండే సాంఘికశక్తి, వారి సంఖ్యాబలమే. కార్మికులలో ఐక్యత లేనప్పుడు, వారి సంఖ్య ఎంతవున్నా, అది బూడిదలో పోసిన పన్నీరు చందమే అవుతుంది. కార్మికులకు వర్గ స్పృహ('మనం ఒక వర్గం' అనే స్పృహ) ఏర్పడాలంటే, అసలు జరగ వలసింది - వారి మధ్య ఐక్యత. కానీ, కార్మికుల్లో అనైక్యతకు కారణం, వారి మధ్య నుండే అనివార్యమైన పోటీయే. కార్మికులు, పోటీనుండి తప్పించుకోవాలి. పోటీని పూర్తిగా తప్పించుకోలేకపోయినా, ఆ పోటీని తగ్గించుకుని పరిమితం చేసుకోవడానికీ, తమలో ఐక్యతని పెంచుకోవడానికీ, కార్మికులు చేసే యాదృచ్ఛిక ప్రయత్నాల్లో నుండే ఆదిలో ట్రేడు యూనియన్లు అభివృద్ధిచెందాయి.

ట్రేడు యూనియన్లు-వేతనాలకూ, పనిగంటలకూ సంబంధించి పెట్టుబడి దురాచారముల నుండి రక్షణ కొరకు, దైనందిన పోరాటాలకు పరిమితం కావడమే, తమ తక్షణ కర్తవ్యంగా భావించుకున్నాయి. ఈ విధమైన ట్రేడు యూనియన్ల కృషి, సమర్థనీయమేగాక అత్యవసరం కూడా.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అమలులో వున్నంత కాలమూ దానితో కార్మికుల పోరాటాలు తప్పవు. ఇట్టి పోరాటాలే, సకల దేశాల ట్రేడు యూనియన్ల నిర్మాణానికీ, వాటి ఐక్యతకూ దోహదం చేస్తాయి. పెట్టుబడితో జరిగే కార్మిక పోరాటాలు, తమకు తెలియకుండానే సంఘటిత కార్మికోద్యమ నిర్మాణానికి కేంద్ర బిందువులవుతాయి. ట్రేడు యూనియన్లే గనక పెట్టుబడిమీద మెరుపు పోరాటాలకు ఆయత్తమైతే, అసలు వేతన శ్రమవ్యవస్థనే రద్దుపరచుటకు అవి క్రమంగా గొప్ప నిర్మాణ సాధనాలవుతాయి.

'మెరుపు పోరాటాలు' అంటే, తాత్కాలిక సమస్యల మీద అప్పటికప్పుడు చేసే పోరాటాలు.

ట్రేడు యూనియన్ల గురించి, ఇంటర్నేషనల్ జెనీవా మహాసభలో చేసిన 'ట్రేడు యూనియన్ల భూత-భవిష్యత్-వర్తమానాలు' అనే తీర్మానంలో, ట్రేడు యూనియన్ల పుట్టుకకూ, వాటి ప్రాముఖ్యతకూ సంబంధించి, ప్రత్యేకంగా పరిగణలోకి తీసుకోదగిన సమస్యలు అనేకం వున్నాయి.

మార్క్సు, ట్రేడు యూనియన్ల గురించి ఆ జెనీవా తీర్మానంలో ఇలా నొక్కి మరీ చెప్పాడు :

"బూర్జువావర్గం చేతిలో మధ్య యుగపు మునిసిపాలిటీలవలె, కమ్యూన్‌లవలె, కార్మికుల చేతిలో ట్రేడు యూనియన్లు, సంఘటిత కార్మికోద్యమ నిర్మాణానికి కేంద్రబిందువులవుతాయి".

మధ్య యుగాలలో, ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా పోరాడుటకు బూర్జువావర్గం చేతిలో మునిసిపాలిటీలూ, కమ్యూన్‌లూ, రాజకీయ పోరాట ఆయుధాలుగా వినియోగపడ్డాయి. అటులనే ట్రేడు యూనియన్లు, కార్మికవర్గం చేతిలో, బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా పోరాడే ఆర్థిక నిర్మాణాలుగానేగాక రాజకీయ పోరాటానికి కూడా కేంద్ర బిందువులవుతాయని మార్క్సు గ్రహించాడు.

మార్క్సు, ఫ్యూడల్ వర్గంతో బూర్జువావర్గం పోరాడిన పోలికకే పరిమితం కాలేదు. అసలు వేతన శ్రమ వ్యవస్థనే రద్దుపరచుటకు ట్రేడు యూనియన్‌లు గొప్ప నిర్మాణసాధనాలవుతాయని కూడా ఇంటర్నేషనల్ తీర్మాన భాగంలోనే చెప్పాడు. దాన్ని బట్టి మార్క్సు, ట్రేడు యూనియన్‌లకు ఎట్టి మహత్తర ప్రాముఖ్యాన్ని ఇచ్చాడో బోధపడుతుంది. అయితే, ఆ ట్రేడు యూనియన్‌లు, జీతాల పెంపువంటి ఆర్థిక విషయాలకే పరిమితమైన సంకుచిత దృక్పథంతో, సంకుచిత ఆచరణతో, తమ చుట్టూ మడికట్టుకొని కూర్చున్న సందర్భాలలో, వాటిని మార్క్సు అతి నిశితంగా విమర్శిస్తూ వచ్చాడు. మొదటి ఇంటర్నేషనల్ యొక్క జెనీవా మహాసభలోనే, ఆ నాటికి సాగుతూ వున్న ట్రేడు యూనియన్ ఉద్యమాన్ని, "వాటి ప్రస్తుత స్థితి" అనే పేరుతో, ఆ తీర్మానంలో వున్న 2వ భాగంలో, మార్క్సు ఇలా చిత్రీకరించాడు:

"ట్రేడు యూనియన్లు, నేటివరకూ ప్రధానంగా, తమతమ స్థానిక సమస్యలపైనే, పెట్టుబడికి వ్యతిరేకమైన ప్రత్యక్ష సమస్యలపైనే, తమ దృష్టిని కేంద్రీకరించాయి. కానీ, వర్తమాన ఉత్పత్తి పద్ధతులనూ, వేతన బానిసత్వ వ్యవస్థనూ ఎదుర్కొనుటలో అవి తమకున్న శక్తిని, పరిపూర్ణంగా ఇంతవరకూ గుర్తించనే లేదు. అందుచేతనే అవి, సాంఘిక, రాజకీయ ఉద్యమాలకు దూరంగా నిల్చిపోతున్నాయి. ఆలస్య మైనప్పటికీ, అవి, ఇప్పుడిప్పుడే జాగృతమవుతున్నాయి. ఇటీవల ఇంగ్లండులో, అవి, రాజకీయ ఉద్యమంలో పాల్గొనడాన్నిబట్టి, తమ చారిత్రక పాత్రను అర్థం చేసుకోవడం మొదలుపెట్టినట్టే. అమెరికాలో అవి, ఉన్నత దృక్పథంతో నిర్వహించే కృషిలోనూ, ఇటీవల షెఫీల్డులో జరిగిన ట్రేడు యూనియన్ ప్రతినిధుల మహాసభలో చేసిన ఈ దిగువ తీర్మానంలోనూ ఈ విషయం చూడవచ్చు. షెఫీల్డు మహాసభ తీర్మానం ఇది:

సకల దేశాల కార్మికులనూ ఒకే సౌహార్ద సంఘంగా ఐక్యపర్చుటలో అంతర్జాతీయ కార్మికసంఘం (ఇంటర్నేషనల్) చేస్తున్న కృషిని, ఈ ట్రేడు యూనియన్ల మహాసభ, సంపూర్ణంగా ఆమోదిస్తున్నది. ఈ మహాసభ, ఈ సభలో పాల్గొంటున్న ప్రతినిధులందరికీ ఒక సూచన చేస్తున్నది. వారు, యావత్తు కార్మికవర్గ సంక్షేమాన్నీ – అభ్యుదయాన్నీ కోరి, తక్షణం ఇంటర్నేషనల్‌లో చేరవలసిందిగా సూచన చేస్తున్నది".

మార్క్సు ఉదహరించిన ఈ ఇంటర్నేషనల్ తీర్మాన భాగాన్ని బట్టి, రాజకీయాలకు దూరమై వున్న ట్రేడు యూనియన్లు, ఎంత నిశిత విమర్శకు గురికాబడ్డాయో, అలాగే, తమ చారిత్రక పాత్రను గుర్తించిన ట్రేడు యూనియన్ల ప్రాముఖ్యత కూడా అంతగానూ నొక్కి చెప్పబడింది.

1860లలో ట్రేడు యూనియను ఉద్యమ స్థాయిని మనం గమనిస్తే, మార్క్సు ఆ ఉద్యమానికి, ఎంతటి ఉన్నతస్థాయి ప్రమాణ పరిగణన యిచ్చాడో బోధపడుతుంది. ఆయన తన కాలంలోని ట్రేడు యూనియన్ కార్యకర్తలముందు, కేవలం ఆర్థిక సమస్యలనేగాక, మొత్తం కార్మికవర్గ కర్తవ్యాలను కూడా వుంచాడు.

మనం చూసిన ఇంటర్నేషనల్ తీర్మానంలో మార్క్సు, ట్రేడు యూనియన్ల భూత, వర్తమానాలకే పరిమితంకాక, వాటి భవిష్యత్తును గురించి ఇలా చెప్పాడు: "కార్మికవర్గ సంపూర్ణ విముక్తికోసం, నేడు ట్రేడు యూనియన్లు, తమ తక్షణ కర్తవ్యాలతోపాటు, కార్మికవర్గాన్ని సంఘటిత పరచే కేంద్ర బిందువులుగా చైతన్యంతో ఎలా కృషిచేయాలో నేర్చుకొని తీరాలి. ఈ ధ్యేయంతో నిర్వహించబడే ప్రతి సాంఘిక, రాజకీయ ఉద్యమాన్నీ అవి బలపర్చాలి. యావత్తు కార్మికవర్గ ప్రతినిధిగా, అగ్రగామిగా, ముందు నిలిచి, యూనియన్లలో లేని కార్మికులను కూడా తమ చుట్టూ సమీకరించడంలో ట్రేడు యూనియన్‌లు కృతకృత్యం కావాలి. అవి, తక్కువ వేతనాలు లభించే వృత్తులలో నున్న కార్మికుల్ని, అనగా అననుకూల పరిస్థితుల ప్రభావంవల్ల ప్రతిఘటనా శక్తిని కోల్పోయిన వ్యవసాయ కార్మికుల

ప్రయోజనాలను అతి జాగ్రత్తగా కాపాడాలి. ట్రేడు యూనియన్లు, పీడిత శ్రామిక ప్రజావిముక్తే ధ్యేయంగా, సంకుచిత తత్వానికీ, స్వప్రయోజనాలకూ పరిమితం కాకుండా తమ కృషి వుంటుందని, యావత్ కార్మిక ప్రపంచాన్నీ విశ్వసింపజేయాలి".

ఇచట గమనించదగిన అంశం ఏమనగా, మార్క్స్, ట్రేడు యూనియన్ల ప్రాముఖ్యతను కార్మికవర్గ పోరాట నిర్మాణ కేంద్రాలుగా మరొక్క మారు నొక్కి చెప్పడమే.

ఆ ఇంటర్నేషనల్ తీర్మానం రాసి 69 యేండ్లయినా, అది నేటికీ సజీవంగానే వుంది. నేటికీ, పెట్టుబడిదారీ దోపిడీ సంబంధాలే సాగుతూ వున్నాయి కాబట్టీ, వాటిపై పోరాటం అవసరం కాబట్టీ.

మార్క్స్, అక్కడికే పరిమితం కాలేదు. ఆయన దృష్టిలోనూ, ఆయన నాయకత్వం వహించిన మొదటి ఇంటర్నేషనల్ దృష్టిలోనూ, ఆర్థికానికీ–రాజకీయాలకూ మధ్య వుండవలసిన సంబంధ బాంధవ్యాల ప్రశ్న కూడా వున్నది. ఈ సంబంధ బాంధవ్యాలపై ఆయన, బకూనిన్ వర్గానికీ, లాసాల్ వర్గానికీ, ట్రేడు యూనియనిస్టులు అనబడే వారికీ వ్యతిరేకంగా తీవ్ర పోరాటం చేశాడు.

మార్క్సుచే ప్రవేశపెట్టబడి, 1871లో అంతర్జాతీయ కార్మికసంఘ (ఇంటర్నేషనల్) లండన్ మహాసభ ఆమోదించిన తీర్మానాన్ని ఒక దాన్ని, ఈ సందర్భంలో చూడండి:

**తీర్మానం:**

"ధనిక వర్గాలు, తమ రాజకీయ ఆధిక్యతకోసం, పశుబల ప్రయోగంతో బరితెగించి, కష్టజీవుల విముక్తి ఉద్యమాన్ని, రక్తపుటేరుల్లో ముంచెత్తడానికి పైబడుతున్న ఫలితంగా...."

"ఆస్తిపర వర్గాలు ఏర్పర్చుకున్న అన్ని పాత పార్టీల నించీ భిన్నంగానూ, వాటికి వ్యతిరేకంగానూ, తాను ఒక రాజకీయ పార్టీగా ఏర్పడితే తప్ప, శ్రామికవర్గం ఒక వర్గంగా, ఆస్తిపర వర్గాల సమిష్టి అధికారానికి వ్యతిరేకంగా వ్యవహరించజాలదు. ఈ విధంగా ఒక రాజకీయ పార్టీగా కార్మికవర్గం ఏర్పడడం అన్నది, సామాజిక విప్లవ విజయాన్నీ, దాని అంతిమ లక్ష్యమైన వర్గాల రద్దునూ ఖాయపరచడానికి తప్పనిసరి. ఆర్థిక పోరాటాలలో కార్మికవర్గం ప్రక్కకు ఇప్పటికే చేరువైన పలుశక్తుల సమ్మేళనం వుందే, అదే, ఈ భూస్వామ్య, పెట్టుబడిదారీ వర్గాల రాజకీయాధికార వ్యతిరేక పోరాటానికి కూడా కీలకశక్తి కాగలదు".

'కార్మికవర్గం పక్కకు చేరువైన పలుశక్తుల సమ్మేళనం' అంటే, స్వతంత్ర ఉత్పత్తిదారులూ, కౌలు రైతులూ, పెటీబూర్జువాలూ, ఈ రకం వర్గాలు కూడా పెద్ద పెట్టుబడిదారుల పరిపాలనకు వ్యతిరేకంగానే వుంటాయి. కాబట్టి, కార్మికవర్గం, అటువంటి వర్గాలకు కూడా నమ్మకం కలిగించి కలుపుకోవాలి–అని అర్థం.

"అందుచేత, ఈ మహాసభ, ఇంటర్నేషనల్ సభ్యులు అందరికీ, గుర్తుచేసేదేమిటంటే, కార్మికవర్గం యొక్క సమరశీల స్థితిలో(మిలిటెంట్ స్టేట్), దాని ఆర్థిక ఉద్యమమూ, దాని రాజకీయ చర్యా, పెనవేసుకుని వుంటాయి. (ఇండిస్సొల్యుబులీ యునైటెడ్)" – ఇది అంతా ఇంటర్నేషనల్ మహాసభ(1871) ఆమోదించిన తీర్మానం.

ఆర్థిక పోరాటాలు, ఎప్పుడూ అక్కడే ఆగడం కాదు. వేతన బానిసత్వాన్ని వదిలించుకోవాలంటే, రాజకీయాధికారాన్ని సాధించే దిక్కు వేపు, ఆ అవగాహనగల భావాలు అభివృద్ధిచెందాలి. శ్రామిక వర్గం, చిన్న చిన్న ఆర్థిక పోరాటాలవేపు నించీ, రాజకీయ పోరాటాలవేపు సాగాలి. ఇదీ, ఆ వర్గానికి, మార్క్సు చెప్పే ఆచరణ క్రమం. కార్మికవర్గం తన పోరాటాన్ని ఎలా ప్రారంభించి, ఎలా ముగించాలో, ఆ క్రమం, ఈ తీర్మానంలో వుంది. పోరాటాన్ని ట్రేడు యూనియన్ల నిర్మాణంతోనూ, రాజకీయ పార్టీ నిర్మాణంతోనూ ప్రారంభించి, చివరికి వర్గాలనే అంతం చేయగల సమానత్వ సంబంధాల్ని ఏర్పర్చడంతో ముగించాలనే ఆచరణ క్రమం ఇది.

శక్తివంతమైన తిరుగులేని ఈ తీర్మానం వుందే, దీన్ని, మార్క్సు మనకు ప్రసాదించి వెళ్ళిపోయిన 'గొప్ప సాహిత్య, రాజకీయ నిక్షేపం'గా మనం భావించు కోవాలి. శ్రమదోపిడీకి వ్యతిరేకంగా, కార్మికవర్గం సాగించే జీవన్మరణ సంగ్రామంలో, ట్రేడు యూనియన్లు వజ్రాయుధాలుగా వినియోగపడగలవని ఈ తీర్మానం విదితం చేస్తున్నది.

కానీ, ఈ విషయాల్లో బకూనిన్ అనే మరో సిద్ధాంతవేత్త వాదం చాలా తేడాగా వుంటుంది. ఆర్థిక సమస్యలను రాజకీయాలకు ముడిపెట్టరాదనీ, ఆర్థికాలూ–రాజకీయాలూ పూర్తిగా విరుద్ధ విషయాలనీ, బకూనిన్‌వాదులు పదేపదే ఇంటర్నేషనల్ సభల్లో వాదించారు. ఆర్థికాలూ – రాజకీయాలూ అవిభాజ్య మైనవని వివరించడం ద్వారా ఈ రకం వాదాలకు, మొదటి ఇంటర్నేషనల్‌లో మార్క్సు గట్టి సమాధానం ఇచ్చాడు.

రెండునెలల తర్వాత బోల్టేకు రాసిన ఒక లేఖలో మార్క్సు, మరల ఆర్థిక – రాజకీయాల మధ్యనున్న సంబంధాన్ని లేవనెత్తి, శ్రామికవర్గ పోరాటంలో 'ఆర్థిక, రాజకీయ పోరాట పాత్ర'లను ఇలా నిర్వచించాడు: "కార్మికవర్గ రాజకీయ ఉద్యమం, రాజకీయాధికారాన్ని కైవసం చేసుకునే అంతిమ లక్ష్యాన్ని సహజంగానే కలిగి వుంటుంది. దీనికోసం, శ్రామికవర్గానికి, తన ఆర్థిక శక్తుల నించే ఏర్పడి, కొంతమేరకు అభివృద్ధిచెందిన 'గత నిర్మాణం' సహజంగానే అవసరం".

కార్మికవర్గ రాజకీయ ఉద్యమానికి 'అంతిమ లక్ష్యం' ఏమిటి? పెట్టుబడిదారీ పాలకుల నించి రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకోవడమేకాదు, అక్కడి తోనే అంతిమంకాదు. ఆ తర్వాత కూడా వర్గ పోరాటాలు వుంటాయి. కార్మికవర్గం, శ్రమదోపిడీని రద్దుచేసేవరకూ, ఆ ఉన్నత సంబంధాలు ఏర్పరిచే వరకూ, సమాజాన్ని మార్చవలసి వుంటుంది. అదంతా జరగడమే–అంతిమ లక్ష్యం. కానీ, ట్రేడు యూనియన్ల కర్తవ్యాలను చర్చించే ప్రస్తుత దశలో, కార్మికవర్గ రాజకీయ పార్టీ ద్వారా రాజ్యాధికారాన్ని పొందడమే అంతిమ లక్ష్యం అవుతుంది. ఈ సందర్భాన్ని బట్టే అంతిమ లక్ష్యాన్ని చెప్పినట్లుగా అర్థంచేసుకోవాలి.

“కాని, కార్మికులు ఒక వర్గంగా, పాలకవర్గంతో తలపడడం ద్వారాగాక, ఒక విడి ఫ్యాక్టరీలో, ఒక విడి పెట్టుబడిదారుడికి వ్యతిరేకంగా, సమ్మెచేసి, పనిగంటల తగ్గింపును కొంత సాధిస్తే, అది కేవలం ఆర్థిక ఉద్యమమే అవుతుంది. అందుకు భిన్నంగా, ఉద్యమ మొకటి ప్రజ్వరిల్లి మొత్తం కార్మికవర్గానికంతటికీ ఎనిమిది గంటల పని చట్టాన్ని సాధిస్తే, అది రాజకీయ ఉద్యమమవుతుంది”.

ఒక కార్మికుడుగానీ, కొందరు కార్మికులుగానీ, తమ యజమానుల దగ్గిర సాధించేది ఆర్థికమే. కార్మిక జనాభా అంతా, అంటే ఆ వర్గం అంతా, హక్కుగా సాధించేది–రాజకీయ ఉద్యమం.

“ఈ విధంగా రాజకీయ ఉద్యమం, ప్రతిచోటా, కార్మికుల విడి విడి ఆర్థిక ఉద్యమాలలో నించే పెంపొందుతుంది”.

ఈ రకంగా, ఆర్థిక ఉద్యమాన్ని, రాజకీయ ఉద్యమంతో జోడించడమెలాగో మార్క్సు విశదపర్చాడు. అంతేగాక, ఉద్యమం ఒక దశనుండి, మరో దశలోకి మారే పరిస్థితులను కూడా విశ్లేషించాడు.

ఇచ్చట ఆర్థిక పోరాటాల ప్రాముఖ్యతపైనేగాక, కార్మికవర్గ ఆర్థిక–రాజకీయ నిర్మాణాల పరస్పర సంబంధాలపై కూడా, సమాధానమివ్వవలసిన అవసరం వుంది. ఈ సందర్భంగా, 1872 సెప్టెంబరు 2–7 తారీకుల మధ్య జరిగిన అంతర్జాతీయ కార్మిక సంఘ(ఇంటర్నేషనల్) హేగ్ మహాసభ నిర్ణయాలు చెప్పుకోదగినవి.

“శ్రామికవర్గ రాజకీయ కార్యాచరణ”పై, మార్క్సు ప్రతిపాదించిన తీర్మానాన్ని, ఇంటర్నేషనల్ హేగ్ మహాసభ ఆమోదించింది.

**ఈ తీర్మానంలో ఇలా వుంది :**

“ఆస్తిపర వర్గాల సమిష్టి అధికారానికి వ్యతిరేకంగా సాగించే పోరాటంలో, ఆస్తిపర వర్గాలకు నాయకత్వం వహించే అన్ని పాత పార్టీలనూ వ్యతిరేకించే తమ సొంత రాజకీయ పార్టీని శ్రామికవర్గం–తన వర్గ పార్టీగా నిర్మాణం చేసుకొన్న పిదపనే, శ్రామికవర్గం, ఏ చర్యకైనా ఉపక్రమించగలదు. శ్రామికవర్గం యొక్క అట్టి రాజకీయ పార్టీ, సామాజిక విప్లవ విజయాన్ని సార్థకం చేయుటకూ, దాని అంతిమ లక్ష్యమయిన వర్గాలను రద్దుపరచుటకూ అవసరం.

ఆర్థిక పోరాటాలలో సాధించే కార్మిక ఐక్యతే, దోపిడీదారుల రాజకీయాధికారానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో, కార్మికవర్గం చేతిలో, ఒక ఆయుధంగా వినియోగపడుతుంది. స్వాభావికంగా భూస్వాములూ, పెట్టుబడిదారులూ, తమ ఆర్థిక గుత్తాధిపత్యాన్ని శాశ్వతం చేసుకోడానికీ, శ్రమజీవులను బానిసలుగా చేసుకోడానికీ, తమ రాజకీయ విశేషాధికారాలను సర్వదా ఉపయోగించుకుంటారు. గనుక శ్రామికవర్గం యొక్క బృహత్తర కర్తవ్యం–రాజకీయాధికారాన్ని కైవసం చేసుకోవడమే”.

కార్మిక వర్గానికి ఒక రాజకీయ పార్టీ వుండాలి –అనే విషయాన్ని మార్క్సు ఎంత గట్టిగా చెపుతాడంటే, ‘అది అత్యవసరం’ అని చెపుతాడు. ట్రేడు యూనియన్లు, కార్మిక జనాభాని ఐక్యపరుస్తూ, వర్గ స్పృహను కలిగిస్తూ, పోరాటశక్తిని పెంచే సంస్థలు. కార్మికవర్గ రాజకీయ పార్టీ కూడా అటువంటిదే అయినా, అది ఒక వృత్తి సంఘం కాదు. అది, మొత్తం కార్మిక వర్గానికంతటికీ సంబంధించి, ఆ వర్గప్రయోజనాలకోసం రాజకీయంగా పోరాడే సంఘం. ఆ రాజకీయ పార్టీయే లేకపోతే కేవలం వృత్తి సంఘాల ద్వారా మాత్రమే కార్మికవర్గ రాజకీయ పోరాటాలు సాధ్యం కావు. అందుకే, కార్మికవర్గ పార్టీ పాత్రని మార్క్సు పదే పదే చెపుతాడు.

హేగ్ మహాసభ ముగింపులో, మహాసభ ఆమోదించిన నిర్ణయాల సారాంశాన్ని వివరిస్తూ మార్క్సు ఉపన్యసించాడు. ఆయన దృష్టిలో, హేగ్ మహాసభ నిర్ణయాల్లో అత్యంత ప్రాముఖ్యమైన, మొదటి ఇంటర్నేషనల్ అభివృద్ధి క్రమంలో పరాకాష్టనందిన, అంశం ఏమిటి? దోపిడీ సమాజానికి వ్యతిరేకంగా, ఆర్థిక–రాజకీయ రంగాలు రెండింటిలోనూ కార్మికవర్గ పోరాటం అవసరమనేదే, హేగ్ మహాసభ యిచ్చిన పిలుపు. శ్రామికవర్గ సర్వసాధారణ వర్గ పోరాటంలో, ఆర్థిక పోరాటం పాత్ర, ఇక్కడ మరొక్కసారి స్పష్టీకరించబడి, నిర్వచించబడింది. తమను దోపిడీచేసే దోపిడీదారుల రాజకీయాధికారానికి వ్యతిరేకంగా సాగే పోరాటంలో, కార్మికవర్గం చేతిలో, ట్రేడు యూనియన్లు, శక్తివంతమైన గొప్ప సాధనాలని నిర్ధారణ చేయబడింది.

మార్క్సు బోధనల్లో, ఆర్థిక, రాజకీయ పోరాటాల మధ్య సంబంధం ప్రధానమైనది. ఈ సంబంధాలపై కొందరు సోవియట్ చరిత్రకారులు, ఆలోచనా రహితమయిన వైఖరి నవలంబించారు. ఇట్టి వైఖరినే కామ్రేడ్ జి.యమ్.స్థెక్లాఫ్, మొదటి ఇంటర్నేషనల్‌పై రాసిన తన గ్రంథంలో ప్రదర్శించాడు. అంతర్జాతీయ కార్మికసంఘ(ఇంటర్నేషనల్) తీర్మానాలపై వ్యాఖ్యానిస్తూ –“రాజకీయ పోరాటాన్ని ఒక సాధనంగా, శ్రామికవర్గ ఆర్థిక పోరాటానికి అనుబంధించాలి” అని మార్క్సు సూత్రీకరించినట్టు స్థెక్లాఫ్ రాశాడు

వాస్తవంగా మార్క్స యిలా సూత్రీకరించాడా? స్థెక్లాఫ్ గ్రంథంలోని మూడవ ప్రకరణాన్నే తీసుకుందాం. అక్కడ మార్క్సు కొటేషన్ ఒకటి వుంది, ఈ విధంగా: “కార్మికవర్గం, ‘ఆర్థిక విమోచనమే’ పరమ లక్ష్యంగా పెట్టుకొని, అందుకు ప్రతి రాజకీయ ఉద్యమాన్నీ ఒక సాధనంగా అనుబంధించాలి”–ఇదీ మార్క్స చెప్పింది.

కార్మికవర్గంయొక్క ఆర్థిక విమోచనమూ, ఆర్థిక పోరాటమూ, రెండూ ఒకటేనా? ‘ఆర్థిక పోరాటం’ అంటే, ఇంకా కార్మికులుగా వుంటూనే, కొన్ని మెరుగుదలల కోసం చేసే పోరాటం. ‘ఆర్థిక విమోచనం’ అంటే, కార్మికవర్గం, శ్రమదోపిడీ నుంచి పూర్తిగా విముక్తిచెందడం. అలా విముక్తి చెందడమే, అసలు సాధించవలసిన లక్ష్యం. దానికోసం, మొదట రాజ్యాధికారాన్ని సాధించగలగాలి. తర్వాత, ఉత్పత్తి సంబంధాల్ని మార్చి, దోపిడీ చట్టాల్ని మార్చి, ఆ రకంగా ఆర్థిక విముక్తికోసం, రాజకీయ పోరాటాలు సాధనాలుగా సాగాలి.

సోవియట్ స్థెక్లాఫ్, ‘ఆర్థిక పోరాటమూ, ఆర్థిక విమోచనమూ’ అనే మాటల్ని ఒకేరకంగా తీసుకున్నాడు. ‘పోరాటం’ అనేది, ఇంకా సాగుతూ వున్నదే. ‘విమోచనం’ అనేది, పోరాటం ముగిసిపోయినది.

మార్క్సు చెప్పింది, కార్మికవర్గం, ఆర్థిక విమోచనాన్నే పూర్తి లక్ష్యంగా పెట్టుకొని, దానికి సహకరించే రాజకీయ పోరాటాలు చేయాలి–అని. ఆర్థిక విముక్తి కోసమే రాజకీయ ఉద్యమం జతకావాలి –అని.

'ఆర్థికం-రాజకీయం' అనే విషయాల్ని సరిగా అర్థంచేసుకోకపోతే, 'దేనికోసం ఏది? అని గ్రహించు కోకపోతే, ఉద్యమాలు తప్పుదారిన సాగుతాయి. ఆర్థిక సంబంధాల్ని బట్టే, వాటికి తగిన రాజకీయాలు. అంతేగానీ, రాజకీయాల్ని బట్టి, ఆర్థిక సంబంధాలు కాదు. రాజ్యాధికారాన్నే చిట్టచివరికి మిగిలే లక్ష్యంగా అనుకుంటే, ఆ అధికారం దేనికోసం? ఆ అధికారంతో దేన్ని సాధించాలి? దాని తర్వాత ఇంకా ఏదో జరగాలంటే, ఆ తర్వాత జరిగేదే అసలు లక్ష్యం అవుతుంది. దోపిడీదారులకు అయితే, రాజ్యాధికారం, దోపిడీని ఇంకా ఇంకా కొనసాగించడానికి. ఆ దోపిడీ సంబంధాల్ని నిలబెట్టి వుంచడానికే, వాళ్ళ రాజ్యాధికారం.

దోపిడీకి గురిఅయ్యే శ్రామిక వర్గానికి అయితే, రాజ్యాధికారం, దోపిడీనించి విముక్తి కోసం. 'ఆ విముక్తి, దేనికోసం?' అనే ప్రశ్న వుండదు. విముక్తి, విముక్తికోసమే.

ఏ వర్గానికైనా అసలు లక్ష్యం, రాజకీయాధికారం కాదు; అది, అసలు లక్ష్యాన్ని సాధించడానికి, సాధనం మాత్రమే. అంతర్జాతీయ కమ్యూనిజాన్ని ఉపదేశించిన ఉపాధ్యాయుడైన మార్క్సుకి కళంకాన్ని తెచ్చిపెట్టే ఏ విధమైన వైఖరినైనా, అది పెద్దదైనా, చిన్నదైనా, దాన్ని ఖండించవలసిందే.

ఈ సందర్భంలో "కమ్యూనిస్టు ప్రణాళిక" (1847)ను తిరగవేస్తే, అది మనకెంతో జ్ఞానబోధక మవుతుంది. అలాగే, ఆ ప్రణాళిక రాసిన పదిహేడేండ్ల తరువాత రాసిన మొదటి ఇంటర్నేషనల్ యొక్క 'ప్రారంభోపన్యాసం' (1864) చూస్తే కూడా. ఆ ప్రారంభోపన్యాసం, కమ్యూనిస్టు సిద్ధాంతానికి ఇంకా పరిపక్వపరిస్థితి ఏర్పడనప్పుడు, కార్మిక సంఘాల న్నింటినీ సమీకరించే లక్ష్యంతో, ఐక్య సంఘటనకు పిలుపు ఇచ్చిన గొప్ప పత్రం. అయితే, ఆ ప్రారంభోప న్యాసమంతటా ఎక్కడా ఒక్కపదమైనా కమ్యూనిజం గురించి ఎత్తలేదు. కాని నిజానికి అది కమ్యూనిస్టు పత్రమే. అమెరికాలో శ్రామికోద్యమ చరిత్రకారుడైన జాన్ కామన్స్, ఆ పత్రం గురించి తప్పుగా, "ఈ ప్రారంభోపన్యాసం, ట్రేడు యూనియన్ పత్రమేగానీ, కమ్యూనిస్టు ప్రణాళిక కాదు" అని రాశాడు. ఇలా చెప్పడం తప్పు. ఈ విమర్శకుడు, ఆ పత్రాన్ని సరిగా చూడలేదు. ఆ ప్రారంభోపన్యాసం, మొదట కార్మికుల ఆర్థిక పరిస్థితులనూ, కార్మిక శాసనాల్లాంటి ప్రధాన సమస్యలనూ లేవనెత్తింది. ఆ పత్రంలో తర్వాత, "రాజకీయాధికారాన్ని స్వాధీనపరుచుకోవడం కార్మికవర్గ మహత్తర విధి" అనే అంశాన్ని కూడా నొక్కి చెప్పింది. మార్క్సు, అదే పత్రంలో, "కార్మిక పార్టీ" సమస్యను కూడా ఓ ప్రత్యేక తరహాలో ప్రస్తావించాడు.

ఆ పత్రంలో, మార్క్సు ప్రస్తావించినది చూడండి:

"కార్మికుల ఒక విజయాంశం-వారికున్న సంఖ్యా బలం. ఈ సంఖ్యా బలానికి, ఐక్యతవల్లనూ, బౌద్ధిక నాయకత్వంవల్లనూ, మొగ్గు ఏర్పడుతుంది. విభిన్న దేశాల కార్మికుల మధ్య వుండవలసిన సోదరత్వం యెడలా, విముక్తి పోరాటాలలో ఒకరికొకరు దన్నుగా నిలుచుట యెడలా, నిర్లక్ష్య భావం వుంటే, అది విరుద్ధ విఫల ప్రయత్నాలకూ-ఓటమికీ ఎలా దారితీస్తుందో, గతానుభవం మనకు రుజువుచేసింది."

'ఐక్యత' అనేది, ఒక అసాధారణ సూత్రీకరణ. మార్క్సు దృష్టిలో, సమీకృతులయ్యే శ్రామిక జన సందోహం, మూడు రకాలు: (1) ట్రేడు యూనియనులో సమీకరించబడేవారు; (2) కార్మిక రాజకీయ పార్టీలో సమీకరించబడేవారు; (3) ఇంటర్నేషనల్‌లో సమీకరించ బడేవారు.

'బౌద్ధిక నాయకత్వం' అనే పాత్ర కూడా, అసాధారణ సూత్రీకరణే. ఏ బౌద్ధిక నాయకత్వ పాత్ర గురించి మార్క్సు చెప్పాడు? విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల నాయకత్వ పాత్రా? విజ్ఞానవేత్తల, ప్రొఫెసర్ల నాయకత్వ పాత్రా?-కాదు. ఇచట, 'బౌద్ధిక' అనగా, అది కమ్యూనిజానికి మారుపేరన్నమాట! కార్మికజనం, కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని నేర్చుకోవాలి. ఈ పదాలు, శ్రామిక సమూహాల లోతుల్లోకి

చ ా చ ే ు ృ క ే ు ఎ ో ఎ ా ల న ే

ఉద్దేశ్యంతో, మార్క్సు, కావాలనే ఇట్టి అసాధారణ పదాలనూ, సూత్రీకరణలనూ ఉపయోగించాడు.

ఎంగెల్సు, 'కమ్యూనిస్టు ప్రణాళిక'లో, 1888 ముద్రణ ఉపోద్ఘాతంలో, అంతర్జాతీయ కార్మికసంఘ (ఇంటర్నేషనల్) ధ్యేయాన్ని ఇలా వివరించాడు: "యూరప్, అమెరికాల యావత్తు శ్రామికవర్గ సమరశీల శక్తులన్నింటినీ, ఒకే మహాసైన్యంగా ఐక్యంచేసే ఉద్దేశంతో యీ ఇంటర్నేషనల్ పుట్టింది. ఇంగ్లీషు ట్రేడు యూనియన్లకూ, ఫ్రాన్సు-బెల్జియం-ఇటలీ- స్పెయిన్‌ల లోని ప్రూడన్‌వాదులకూ, జర్మనీ లాసాల్‌వాదులకూ, తలుపులు తెరిచేటంతటి 'విశాల కార్యక్రమం' దీనికి అవసరమైంది."

మార్క్సు సిద్ధాంతాన్ని వ్యతిరేకించే ప్రూడన్, లాసాల్ వంటి సిద్ధాంతకర్తల్ని చాలామందిని, ఈ పుస్తకంలోనే తర్వాత భాగాల్లో చూస్తాం.

ఎవరి సిద్ధాంతం ఎలా వున్నా, అందరూ బీద ప్రజల గురించే మాట్లాడే వారైనప్పుడు, అందరూ ఒకచోట జేరి చర్చించుకోవాలి కాబట్టి, అన్నిరకాల వారూ, ఇంటర్నేషనల్‌లో సభ్యులయ్యారు.

ఇంటర్నేషనల్ పెట్టుకున్న ఆ విశాల కార్యక్రమం గురించి మార్క్సు, 'ప్రారంభోపన్యాసం'లో అన్నది:

"శ్రామిక ఉద్యమం ప్రస్తుతం తీసుకున్న వైఖరికి ఆమోదయోగ్యమైన రూపంలో మన అభిప్రాయాలు కనిపించేవిధంగా, విషయాన్ని వ్యక్తంచేయడం చాలా కష్టం...గతంలో వాడిన భాషలోని సాహసాన్ని, తిరిగి జాగృతమయిన ఈ ఉద్యమం ఆమోదించడానికి కొంతకాలం గడపాలి".

మార్క్సు ఇచట, ఉద్దేశాన్ని ప్రకటించే, ప్రత్యక్ష పరచే భాషయొక్క స్వరూపం గురించి ముచ్చటించాడు గానీ, దాని స్వభావం గురించి కాదు. భాష స్వభావం, కమ్యూనిజమే. కమ్యూనిస్టు ఉద్దేశాల స్వభావం దగ్గర ఆయనెంత మాత్రమూ రాజీపడలేదు.

స్వరూపం యెడల మాత్రమే ఆయన ఉదారతను కనబరిచాడు. ఇదే ఆయన 'ప్రారంభోపన్యాసం'లోని ట్రేడు యూనియను పరిభాష. 'కమ్యూనిస్టు ప్రణాళిక' తరువాత చెప్పుకో దగిన పత్రం ఇది. ఆయా దశల్లోని కార్మికవర్గ నిర్మాణ స్థాయినీ, ఉద్యమ స్వభావాన్నీ, ఆధారం చేసుకొని, శ్రామిక సమూహాల నుద్దేశించి, పద్ధతులను మార్చుకుంటూ, కమ్యూనిస్టు చైతన్యాన్ని కార్మికోద్యమం లోకి జొనిపాడు.

ఆర్థిక, రాజకీయ పోరాటాల మధ్యనున్న బాంధవ్యాన్ని నిక్కచ్చిగా నిర్వచించాలంటే, దాన్ని ట్రేడు యూనియన్లకూ, కార్మిక రాజకీయ పార్టీకి మధ్య బాంధవ్యంగా నిర్వచించవచ్చు. ట్రేడు యూనియన్లకూ, శ్రామికవర్గ ఆర్థిక పోరాటాలకూ ప్రాముఖ్యతనిస్తూనే, ఆర్థిక సమస్యలపై రాజకీయ సమస్యలకున్న ప్రాధాన్యతను కూడా మార్క్సు నొక్కి చెప్పాడు.

ఆర్థిక సమస్యలపై రాజకీయ సమస్యల ప్రాధాన్యత గురించి మాట్లాడుతున్నామంటే, ట్రేడు యూనియన్లను రాజకీయ పార్టీగా మార్చివేస్తున్నామనిగానీ, కేవలం పార్టీ కార్యక్రమాన్నే ట్రేడు యూనియన్లు ఆమోదించడం –అని గానీ, అర్థంకాదు. లేదా, ట్రేడు యూనియన్లకీ, పార్టీకీ మధ్యనున్న వ్యత్యాసాలను, రద్దుపరచడం అసలే కాదు. ఆ సంస్థల మధ్య వ్యత్యాసాలే వుండవని కూడా కాదు. మార్క్సు అలా చెప్పలేదు. ఆయన చెప్పిందల్లా, విశాల శ్రామిక సమూహాల నిర్మాణ కేంద్రాలుగా ట్రేడు యూనియన్ల ప్రాముఖ్యత గురించే. పార్టీనీ, ట్రేడు యూనియన్లనీ, కలగా పులగంచేసి ఏకరాశిని చేయడానికి వ్యతిరేకంగానే ఆయన పోరాడాడు.

'శ్రామికవర్గ ఆర్థిక విమోచన'అనే అసలు లక్ష్యాన్ని, శ్రామికవర్గ ఆర్థిక సంస్థలూ, రాజకీయ సంస్థలూ కూడా కలిగి వుండాలని మార్క్సు భావించాడు. ఆ లక్ష్యానికి అనుగుణంగా, ఆ సంస్థలు, దేని పాత్ర అది నిర్వహించాలి. ఆర్థిక సమస్యలపై రాజకీయాల ప్రాధాన్యతను, యీ విధంగా అర్థంచేసుకోవాలి. శ్రామికవర్గ రాజకీయ పార్టీ (కమ్యూనిస్టు పార్టీ), శ్రామిక ఆర్థిక కర్తవ్యాలను నిర్వచించి, ట్రేడు యూనియన్లకు నాయకత్వం వహించి నడిపించాలి.

'కమ్యూనిస్టు పార్టీ'గానీ, 'ట్రేడు యూనియన్లు' గానీ, –ఈ రెండు రకాల సంఘాలూ, కార్మికవర్గానికి, శ్రమదోపిడీనించి విముక్తి చెందడంకోసం, వర్గ చైతన్యం కలిగించవలసిన సంఘాలే. అయితే, ఆ సంఘాల కర్తవ్యాలూ, వాటి పరిమితులూ వేరు.

ట్రేడు యూనియన్లు ప్రధానంగా, పని స్థలాలలో ఆర్థిక సమస్యలపై చేసే పోరాటాల ద్వారా, కార్మిక జనాభాకి, "కార్మికులందరూ ఒక వర్గం. శ్రమచేసే వర్గం"అనే నూతన భావాలు కలిగించవలసి వుంటుంది. కార్మిక జనానికి, వర్గ రాజకీయాలు కూడా నేర్పవలసి వుంటుంది.

కమ్యూనిస్టు పార్టీ సాధించవలసిన ప్రధాన లక్ష్యం–కార్మికవర్గ విముక్తి. దానికోసం అవసరమైన మార్గం అంతా, దాని ప్రయాణమార్గమే. అనేక రకాల ప్రజాసంఘాలకూ, శ్రామిక వృత్తి సంఘాలకూ, కమ్యూనిస్టు పార్టీ బోధకురాలు.

oooo